
# లైసెన్సు బిళ్ళ!

**జొన్నలగడ్డ సదాశివ**



"ఏవండీ! ... మిమ్మల్నే ! ..."

మా ఆవిడ నాభుజం మీద చరుస్తోంది! అతి ప్రయత్నం మీద కళ్ళు తెరిచి, పొద్దున్నే 'కిరికిరి' ఎందుకని - మా శ్రీమతి మొహంలోకి ఓ చిన్న సన్నటి 'స్మైల్' విసిరి - 'ప్లీజ్', ఒక్కరగంటాగి లేపవే! అబ్బే ... నిద్దరైపోయింది. ఊరికేనే ... కాస్త బద్ధకంగా వుంది. ఆఁ ప్లీజ్!" అంటూ మళ్లీ దుప్పటి మొహం మీదకి లాక్కుని ముసుగు తన్నబోతుండగా మొత్తం దుప్పటి లేచిపోయింది! ఒళ్లు మండిపోయింది నాకు. ఇహ కిర్కిరీ తప్పదు! "ఏమిటి నీ ఉద్దేశ్యం? చెప్తే అర్థం కాదా? ఒక్కరగంట ఆగమంటే...?' కొంచెం కటువుగానే అన్నాను.

"రాత్రి ఏమని చెప్పారు ?" లాయర్‌లాగా 'క్రాస్ ఎగ్జామినేషన్'కి నాంది పలికింది!

"ఆరు గంటలకి లేపమన్నారూ. ఏం? ఇప్పుడెంతయింది?" 'బోను'లో నిలబడి, ఎదురు ప్రశ్నించినట్టు! నేను మాత్రం తక్కువా?!

"కొంచెంగా, ఎనిమిదిన్నరయింది మహానుభావా!"

అదిగో - నా శ్రీమతి అలా మాట్లాడినప్పుడల్లా నాకు ఛెళ్లున గుర్తుకొచ్చే మాట ఒక్కటే!

"భార్యలు ఆగ్రహాన్ని, అతి సౌమ్యంగా, ఎకసక్కెంగా మలిచి, మాట విసిర్తే అది ప్రమాద సూచన అన్నమాట. వాళ్ల గెలుపుకు కావల్సిన 'ఆర్గ్యుమెంటు'ని రెడీగా వుంచుకున్నారన్నమాట!' అని, నా గురువుగారు మునిమాణిక్యంగారు వేళ్ల సందున 'డక్కన్' సిగరెట్టు ఉంచుకొని మరీ వెన్నుతట్టి చెప్పినమాట! ఇహదిగిరాక తప్పుతుందా!


'అబ్బా! ఎనిమిదిన్నరయిందన్న మాట! సరే ... ఓ పన్నెండ్!' అన్నాను మళ్లీ మామూలుగా.

'ఏమిటిట?' కోర ఓరచూపులోంచొచ్చిన క్వొస్చెన్.

'ఒక్కరగంటలో లేచేస్తా. లేవకపోతే లేపెయ్. పరవాలేదు.' అని బోర్ల తిరిగి చెంప దిండు కానించి కళ్లు మూసుకున్నాను.

'ఇక ఈ మేలుకొలుపులు నా వల్లకాదు. పన్జేసుకుంటూ - అటొచ్చి, ఇటొచ్చీ ఆరింటినించి లేపుతున్నా. కొంపలో ఒక్క చుక్క నీళ్లు లేవు. పెద్దాడు పదింటికల్లా వెళ్లాలిట... "ఇంకా ఏమేమో సణుగుతూ వంటింట్లో కెళ్లింది.

ఛప్పున లేచి కూచున్నాను - మా పెద్దబ్బాయి ఆరోజు ఓ మంచి కంపెనీలో 'ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్' 'ఇంటర్వ్యూ'కి వెళ్లాలని గుర్తొచ్చి - చకచకా ఇవతలి కొచ్చి - ముందు గదిలోకి చూశాను. పెద్దాడు ఏదో 'గ్రూప్ డిస్కషన్' పుస్తకం తిరగేస్తున్నాడు.




"కరెంటు పోయి ఎంతసేపయింది - నీళ్ల పోవటానికి?" నా భార్య నుద్దేశించి అన్నాను. - అంటే ఆ రెండింటికి సంబంధమేమిటని మీరనుకోవచ్చు! ఉంది! మా 'కాంప్లెక్సు'లో కరెంటు పోకడకీ - నీళ్ల రాకడకీ సంబంధం వుంది. 'మోటార్' నడిచి 'ట్యాంక్' నిండితేనే మా ఫ్లాట్స్‌లోకి నీళ్లొచ్చేది. లేకపోతే - నాలుగొందలపైన ఫ్లాట్సుకి, ఓ పక్కన ఓ ఏకైక బోరింగ్ పంపుంది. అక్కడ చేతులకి పనిచెప్పి - తర్వాత మేమున్న 'సెకండ్ ఫ్లోర్'కి గంగని మోసుకెళ్లక తప్పదు. ఆరోగ్యరీత్యా మా ఆవిడకి ఆ పని నిషిద్ధం. చిన్నాడు రాత్రి చదువుకోటానికి ఫ్రెండింటికెళ్లాడు. వాడొచ్చేసరికి తొమ్మిది దాటుతుంది. 'అదన్నమాట దాని ధీమా!' అనుకున్నాను. గురువులు ఊరికే చెప్తారా అనుభవం లేకుండా!

రెండు స్టీలు బిందెల్ని, రెండు పెద్ద ప్లాస్టిక్ బకెట్లలో దిగేసి నా ముందుకు తోస్తూ, నా ప్రశ్నకి మా ఆవిడ సమాధానం - 'కరెంటెప్పుడుపోయిందో కూడ తెలిసే స్థితిలో వున్నారా, రాత్రి మీరు? ఫ్యాన్ తిరక్కపోయినా - దోమలు పీల్చి పిప్పి చేసినా ఒళ్లు తెలిస్తేగా!'

నిజమే! ఈ మందులో అదో సౌలభ్యం వుంది! మిగతా ఇబ్బందులేమి మనల్ని బాధించలేవు!

అన్నట్టు ఇది ఇప్పటి విషం కాదు మహాప్రభో!

'శుక్ర శాపాత్సురాదేవి, సురాపానం నదుష్యతి!'

అన్నట్టు - శుక్రాచార్యులవారి శాపానికి అదే, అదే... 'ఈ' 'కలియుగ' - నిషేధానికి పూర్వ విషయం!

మళ్లీ నోరెత్తకుండా - లుంగీ పైకి కట్టి - రెండు చేతుల్తోనూ బకెట్లు (బిందెలతో సహా) పట్టుకుని మెట్లు దిగాను. ఆఫీసుల వాళ్లకి టైం అవటంతో - నా 'జాతి' వాళ్ల క్యూ చిన్నదిగానే వుంది. పాపం! ఆవిడ వాళ్ల క్యూ మూడు వంకర్లు తిరిగి, ఇంకా పెరుగుతూనే వుంది - హనుమంతుడి తోకలా ! అదృష్టానికి మురిసిపోతూ - ఎలాగో తెచ్చిన నాలుగు సామాన్లూ నీళ్లతో నింపి, ఒక్కొక్కటీ పైకి చేర్చేసరికి తలప్రాణం తోకలోకి దిగింది. నడుం పట్టుకుని అలా పడక్కుర్చీలోకి జారి పోయాను. నేను కాస్త ఊపిరి పీల్చుకునేసరికి - మావాడు స్నానం పూర్తి చేసి, తయారై, మా ఇద్దరి కాళ్లకి దణ్ణం పెట్టి బయల్దేరాడు. నా శ్రీమతి వాడిని సాగనంపటానికి వెనకాలే 'హనుమానంజనాసూను:....' చదువుతూ 'స్టైర్‌కేస్' దాకా వెళ్లింది - ఎవరు వెళ్తున్నా, తన అలవాటు ప్రకారం.



## ఆహ్వానం

1962 సంవత్సరంలో గ్రీసు దేశపు రాజు భారతదేశాన్ని అధికారపూర్వకంగా సందర్శించడానికి వచ్చాడు. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ వచ్చిన ఆ రాజును ఆహ్వానిస్తూ "మహాశయా! గ్రీస్ దేశం నుండి మా భారతదేశానికి అతిథిగా వచ్చిన మొదటి మహారాజులు మీరు. అప్పట్లో ఎలాంటి ఆహ్వానం లేకుండా అలెగ్జాండర్ మా దేశానికి వచ్చారనుకోండి" అన్నారు నవ్వుతూ.

సేకరణ: **కలపర్తి సత్యం**
(ఏలూరు)

కాఫీ గుర్తొచ్చి - బాత్‌రూంలో దూరి నిముషంలో మొహం కడిగేసి టవల్‌తో తుడుచుకుంటూ ఓ కేకపెట్టాను.

'ఏమేవ్! కాఫీ...' అంటూ సమాధానం లేదు. చాదస్తం కాకపోతే - వాడు మూడంతస్తుల మెట్లూ దిగి, 'బిల్డింగ్' మలుపు తిరిగే వరకూ బాల్కనీలో నిలబడాలా! మళ్లీ ఓ కేక పెట్టా. అయితే - ఈసారి నా కేక నా గొంతులోనే ఆగినట్టయింది. అంతకు మించిన ఆర్తనాదం కిందనుండి వినపడసాగింది. పైగా - అది ఆగలేదు. ఒకసారికి మించి మరోసారి ...గాడిద ఓండ్రపెట్టినట్టు అలా అరుస్తూనే వున్నారెవరో.

ఎవరికి వాళ్లు నీళ్ల హడావుడిలో వుంటే - ఎవరైనా దొంగ 'కాంప్లెక్స్'లో ప్రవేశించాడేమో అనుకున్నాను. చితకబాదుతున్నట్టు - అరుపులు మరీ ఎక్కువైపోతున్నాయి. సరిగ్గా మా బిల్డింగ్ ముందునుంచే అరుస్తున్నాడు. ఎవరో చూద్దామని బయటికి రాబోతుంటే - మా ఆవిడ కంగారు పడిపోతూ వచ్చి నన్ను ఢీకొట్టింది. ఆ చిరాకుతో - 'ఏవిఁటే ? ఏమయింది ? ఏవిఁటా కంగారు ?' అంటూ నేను కంగారుపడిపోతూ అడిగాను.

'అబ్బ! తప్పుకోండి ముందూ..' అంటూ నన్ను దాదాపు పక్కకి తోసేసి - మా ఆవిడ సరాసరి బాత్‌రూంలో దూరింది.

'కొంపదీసి - వాంతి గాని చేసుకోటల్లేదు గద!" అనుకుని - "ఏమయిందే - జవాబు చెప్పకుండా ఏవిఁటా పరుగు? వాంతిగానీ ... " బాత్‌రూం వైపు అడుగేశాను. మా ఆవిడ నీళ్ల బకెట్‌తో బైటకొచ్చి -

చాల్లెద్దురూ ... సాద! అవతల మనిషి కిందపడి తన్నుకుంటూంటే - మీకు చెలగాటంలా వుంది. ఈ బకెట్ పట్టుకుని కిందకి నడవండి. నేను బిందె తెస్తాను.' అని వెనుదిరిగింది.

అప్పటికీ నా ట్యూబ్‌లైట్ వెలగలా.

"ఎందుకే ? కష్టపడి తెచ్చిన నీళ్లు! మళ్లీ కింద కెందుకు?"

'అయ్యో రాత! ఎవరో పాపం - కుర్రాడు మూర్ఛతో కిందపడి కాళ్లూ చేతులూ కొట్టుకుంటున్నాడు. నాలుక వెళ్లుకొచ్చింది. పదండి త్వరగా.' అంటూ బిందె చంకనెత్తుకుని నామాట ఇహ వినిపించుకోకుండా మెట్లుదిగిపోతోంది.

అసలు 'కేసే'మిటో చూద్దామని బాల్కనీలో కెళ్లి కిందికి చూశాను. ఓ పద్దెనిమిది - ఇరవై ఏళ్ల కుర్రాడు - పాపం గిలగిల కొట్టుకొంటున్నాడు నీళ్లలో. అప్పటికే నాలుగైదు బిందెల నీళ్లు పోసినట్టున్నారు. మొత్తం తడిసిపోయాడు.

నేలమీద కాలవ కట్టిన నీళ్లని కూడా నాలుకజాపి అందుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో మా ఆవిడ బిందె ఎత్తి ధారకట్టి పోస్తూ పైకి చూసి -

'ఇంకా పైనించి చూస్తూ నిలబడ్డారేమిటండీ! ఖర్మ! బకెట్ పట్టుకు రండి తొరగా !' కేకపెట్టింది. నేను తీసుకెళ్లకపోతే - తనే వచ్చి తీసుకెళ్లి, ఎక్కడ అడ్డం పడుతుందోనని భయమేసి, బకెట్ తీసుకెళ్లాను. 'అది ఇక్కడ పెట్టి, పైకెళ్లి ఆరెండో బిందె కూడా తీసుకురండి. ఇవినే పోస్తా వెళ్లండి.' తోచకుండా తరిమింది.

చచ్చినట్టు రెండంతస్తులూ ఎక్కి, మళ్లీ బిందె తీసుకుని కిందకు దిగేసరికి మా ఆవిడ ఆ బకెట్ కూడ ఖాళీ చేసింది. నాచేతిలో బిందె అందుకుని ధారకట్టి పొయ్యసాగింది. మరిహ మా ఇంట్లో నీళ్ల చుక్కలేదు. వాడి అదృష్టానికి, ఎదుటి బిల్డింగ్ వాళ్లు కూడ నాలుగైదు బిందెలు సప్లై చేశారు.

అప్పటికీ, వాడు కొంచెం తగ్గుస్థాయిలో అరుస్తూ, ఒగురుస్తూ చేతులుజాపి పొట్ట మీద కొట్టుకుంటూ ఏడుస్తూ బొబ్బలు పెడుతున్నాడు. అప్పుడు చూశాను వాడి మెళ్లో - పట్టుతాడు కట్టి వేళ్లాడుతున్న నాలుగంగుళాల చదరపు ఇత్తడి 'ప్లేటు'!

"అమ్మలారా! తండ్రులారా! బాబాయిల్లారా, పిన్నులారా! అక్కలారా, అన్నలారా ! దిక్కుమాలిన వోడ్ని. మూరిశరోగం వోడిని! అమ్మలారా సలికి సత్తన్నాను - ఓ దుప్పటి! అయ్యా - ఓ లాల్సీ! అన్నా - ఓపేంటు! ఓ సర్టు! దానం సెయ్యండి. ఆకలి! అమ్మో ఆకలి!" ఏడుపులోనే ఓ పాటలా కట్టి అడుక్కుంటున్నాడు.

"మూర్ఛ తగ్గాక - పాపం, విపరీతమైన ఆకలి వేస్తుందట పిన్నీ." అంటూ పిన్ని కంటె పెద్దదైన ఓ ముత్తైదువు తమ ఫ్లాట్‌లో కెళ్లింది. దాంతో నలుగురూ వెళ్లి ఇళ్లల్లోంచి తెచ్చిన అన్నాలు, టిఫిన్లు వాడి పక్కనే పడివున్న గిన్నెలో వేశారు. మొగవాళ్లు కూడ ఎవరికి తోచినవి వాళ్లు డబ్బులు, ప్యాంట్లూ, షర్టులూ రకరకాల బట్టలు వాడి మీద కప్పారు. సన్మానపు దండల్లా వాడి భుజం నిండిపోయింది. నోట్లోంచి కారుతున్న చొంగ నురుగుని, ఓసారి సంపాదించిన బట్టలతో తుడుచుకుని - అందరికి ఓ దణ్ణం పెట్టి తన అన్నం గిన్నె తీసుకుని చకచకా నడిచి వెళ్లిపోయాడు. ఎవరికి వాళ్లు జాలిపడుతూ వెళ్లిపోయారు ఇళ్లల్లోకి.

అన్నట్టు, మా అబ్బాయి ప్యాంటు, షర్టు కూడ వాడికి దానం చేసింది మా ఆవిడ.

"నీళ్ల పోశాం గద! పిల్లాడి ప్యాంటూ, షర్టు ఇవ్వకుండా వుండాల్సింది." అన్నాను.



**నెక్లెస్**

"మెడలో ఆ నెక్లెస్ లేకున్నా నీవు అందంగానే కనిపిస్తావ్ శ్రీలతా!"

"డొంక తిరుగుడు ఎందుకులెండి.. దాన్ని కూడా తాకట్టు పెడదామనా మీ ప్లాన్? ఆ పప్పులేం ఉడకవ్".

భోగా (హైదరాబాదు)

"ఇంకా నయం. ఎన్ని బిందెల నీళ్లు తాగాడని! పిచ్చి వెధవ! వెంటనే బట్టలు వేసుకోకపోతే వాతం కమ్మి చావడూ? అందుకే - ఎవరికి తోచింది వాళ్లు తెచ్చి కప్పారు." సమర్థించింది మా ఆవిడ.

"వాడు వేసుకోకుండానే వెళ్లాడుగదుటే! అయినా వాడు నీళ్లెక్కడ తాగాడు? అన్నీ కిందే పోయి మడుగు కడితేనూ!"

'ఛ! పాపం, నోటిలోంచి నురగలు కూడ వచ్చాయి."

"నీళ్లు ఎత్తు నుంచి పోస్తే - నురగలు రాక ఏమొస్తాయి నా పిండాకూడు." దాని అమాయకత్వానికి నాకు కోపం కూడా వచ్చిన మాట నిజమే అయినా మనసులో మళ్లీ - అనవసరంగా అనుమానించానేమో అని బాధపడ్డాను.

"కొంపలో ఒక్కచుక్క నీళ్లు లేవు. ఇలాగే వెళ్లి ఏకంగా ఈ మూడింటితో తెచ్చెయ్యండి. మళ్లీ మెట్లు ఎన్నిసార్లు ఎక్కి దిగుతారూ?" అని నా మేలుకోరి ఆర్డరు వేసి చక్కాపోయింది. ఇంతవరకూ కాఫీ మాత దర్శనం కూడా కాలేదు! తప్పేదేముంది? బకెట్లు, బిందెలు పట్టుకుని పంపు దగ్గరకెళ్తే - తిరిగొచ్చేసరికి పన్నెండు!

ఆ సాయంత్రం - శనివారం అని, పంచ ముఖాంజనేయ స్వామి గుడి ప్రోగ్రాం పెట్టింది మా ఆవిడ. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర బస్సు దిగి నడుస్తున్నాం. గాంధీ ఆసుపత్రి మలుపు తిరుగుతుండగా మా ఆవిడ నిలబడిపోయింది.

'ఏమిటి? ఏమైనా కొనాలా?" అడిగాను.

"అక్కర్లేదుగానీ - అటు చూడండి. ఆ గోడ పక్కంబడి పాత బట్టలు కొనేవాళ్లేగా? వాడూ ... గుర్తుపట్టారా?"

"ఆఁ ఆఁ. వాడే." అప్పటికే నాకు విషయం అర్థమైపోయింది. ఆ కుర్రాడు, వచ్చిన బట్టలన్నీ లెక్కపెట్టి మరీ అవి కొనే స్త్రీకి ఇవ్వడం - అది డబ్బు - పది రూపాయిలనోట్లు, రెండో, మూడో - ఇవ్వటం కళ్లారా చూశాం. వాటిలో - మా వాడి ప్యాంటూ, షర్టూ కూడ వున్నాయి! వాడి చేతిలో డబ్బు పడగానే - వెనక్కి తిరిగి మొండా వైపు పరుగుతీశాడు. మెళ్లో ఇప్పుడు 'లైసెన్సు బిళ్ల' లేదు. పొద్దుటి నిక్కరుతోనే ఉన్నాడు. నోట్లో మాత్రం ఫిల్టర్ సిగరెట్టుంది! వెర్రిగా నా మొహంలోకే చూస్తున్న మా ఆవిడ కళ్లలో నిలిచిన నీటి చుక్కలు కిందకు జారలేదు! ●

